సాక్షి జోగులాంబ గద్వాల


బుధవారం । 16 । జులై । 2025



రిజిస్ట్రేషన్.. ఫ్రస్టేషన్

అత్యధిక ఆదాయం అందించే రిజిస్ట్రేషన్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది.

వివరాలు 10లో ▸



శ్రీశైలం గేట్ల మూసివేత

ఎగువ నుంచి వరద రాక తగ్గడంతో శ్రీశైలం ఆనకట్ట గేట్లు మూసివేశారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 36.2 /23.1

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్

గద్వాల: జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన **బీసీ నిరుద్యోగ** యువతకు గ్రూప్స్, ఆర్ఆర్**బీ, ఎస్ఎస్సీ**తోపాటు బ్యాంకింగ్ సర్వీసులకు **టీజీ బీసీ స్టడీ** సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ **ఇవ్వనున్నట్లు** టీజీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ **రాములు ఒక** ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే 5 నెలలు కోచింగ్ ఇవ్వబడుతుందని, అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.tsbcstudycircle.gov.in నందు ఈ నెల 16 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ తరగతులు ఆగస్టు 25 నుంచి ప్రారంభమవుతాయని, కోచింగ్ సమయంలో నెలకు రూ.వెయ్యి స్టైఫండ్ ఇవ్వబడునని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50 లక్షలలోపు పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవత్వం

గద్వాల క్రైం: జిల్లా పోలీసు శాఖలో ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్‌కు తోటి సిబ్బంది రూ. 80వేల ఆర్థిక సహాయని ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సహ ఉద్యోగి కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు చేయూత ఇవ్వడం స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. సమస్యలలో ఉన్నప్పుడు మనోధైర్యం ఇవ్వడంతో పాటు ఆర్థికంగా సహాయం అందజేయడంపై ఎస్పీ సిబ్బందిని అభినందించారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సహ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



ఎండీ జబ్బార్, అధ్యక్షుడు



అబ్బాస్, ప్రధాన కార్యదర్శి

గద్వాలటౌన్: ఆవాజ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను, 39 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎండీ జబ్బార్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్, కోశాధికారిగా షేక్ అబ్దుల్ సత్తార్, సీనియర్ ఉపాధ్యక్షులుగా అతిఖుర్ రెహమాన్, ఉపాధ్యక్షులుగా అజీజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ హాషం, అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శులుగా ఎంఏ జబ్బార్, ఎంఏ ఇక్బాల్‌లతో పాటు 30 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు.

అమరచింత చేనేత సంఘానికి అవార్డు



అమరచింత: అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘాన్ని ఉత్తమ సంఘంగా ఎంపిక చేసి జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదుగా కంపెనీ సీఈఓ చంద్రశేఖర్‌కు అవార్డును అందించారు. నాబార్డు ఏర్పడి నేటికి 44 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం నాబార్డ్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం సీఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరేళ్లుగా సంఘాన్ని కొనసాగిస్తూ చేనేత కార్మికులే కంపెనీ షేర్ హోల్డర్స్‌గా నియమించడంతో పాటు వచ్చిన లాభాల్లో అందరికీ సమాన వాటా ఇస్తున్నామని తెలిపారు. తమ కృషిని గుర్తించి నాబార్డు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సంఘంగా ఎంపిక చేసి అవార్డు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్, టీజీ క్యాబ్ చైర్మన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు దాటిస్తున్నారు!

కర్ణాటకలోని బ్లాక్ మార్కెట్‌కు మిల్లర్ల ధాన్యం తరలింపు



నందిన్నె చెక్‌పోస్టు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- తాజాగా ధాన్యం, బియ్యం లారీలు రాయచూరు తరలింపునకు యత్నం
- గ్రామస్తుల పట్టివేత..
- మిల్లు యజమాని కుమారుడి దౌర్జన్యంతో వెనక్కి తగ్గిన గ్రామస్తులు
- రూ.12 లక్షల విలువైన ధాన్యం దొరికినా కేసు నమోదు కాని వైనం
- కేసు లేకుండా చేసేందుకు సివిల్ సప్లై అధికారితో రూ.లక్షల్లో ఒప్పందం?

గద్వాల: రైతుల నుంచి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి.. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాలని మిల్లర్లకు కేటాయిస్తుండగా.. కొందరు మిల్లర్లు ఇదే అదనుగా అవినీతికి తెరలేపుతున్నారు. యథేచ్ఛగా ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు, పక్క రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున కేటీ.దొడ్డిలో ప్రభుత్వం సీఎమ్మార్ నిమిత్తం మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని ఓ మిల్లర్ దొంగచాటుకు బ్లాక్ మార్కెట్‌కు తరలించే యత్నం చేసిన ఘటన నిజమనే చెబుతుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలిలా.. కేటీదొడ్డి మండంలోని ఓ రైస్ మిల్లు యజమాని ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు పథకం రచించాడు. ఇందుకోసం 12 టైర్ల సామర్థ్యం ఉన్న ఓ లారీని మంగళవారం తెల్లవారుజామున మిల్లు వద్దకు రప్పించి అందులో సుమారు 400 క్వింటాళ్ల (535 బస్తాలు) ధాన్యం లోడ్ చేశారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక బార్డర్ దాటించి రాయచూర్ జిల్లా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు.

ఫిర్యాదు ఇస్తే కేసు

ధాన్యం లారీ పట్టుకున్న వ్యవహారంపై కెటి.దొడ్డి ఎస్ఐ శ్రీనివాసులను వివరణ కోరగా.. ధాన్యం లారీని గ్రామస్తులు పట్టుకుని తమకు సమాచారం ఇస్తే వెళ్లి స్వాధీనం చేసుకున్నాం. అయితే ధాన్యం లోడుతో ఉన్న లారీ అక్రమంగా వెళ్తుందా.. అన్న విషయాన్ని సివిల్‌సప్లై శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది. వారు ఫిర్యాదు ఇస్తే చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తాం. ఇప్పటి వరకు ధాన్యం లారీపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. భద్రతాకారణాల దృష్ట్యా ధాన్యం లారీని చింతలకుంట రైస్‌మిల్లులో భద్రపర్చామని ఎస్ఐ తెలిపారు.

అయితే విషయం తెలుసుకున్న కొంతమంది గ్రామస్తులు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న లారీని అడ్డుకున్నారు. అయితే అదే మిల్లు నుంచి బియ్యం లోడుతో ఉన్న మరో లారీ కూడా అక్కడికి రావడం గమనించిన గ్రామస్తులు బియ్యం లారీని సైతం అడ్డుకుని నిలిపేశారు. ఈక్రమంలో మిల్లు ఓనర్ కుమారుడు దౌర్జన్యంగా లారీని స్టార్ట్ చేసి గ్రామస్తులపై ఎక్కించే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామస్తులు పక్కకు తప్పుకోగా.. అదే అదనుగా భావించి బియ్యం లోడు లారీని కర్ణాటకలోని రాయచూరుకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

కేసు లేకుండా చేసేందుకు రూ.10 లక్షలతో భేరం

కేటీ.దొడ్డిలోని రైస్‌మిల్లు ఓనర్‌కు రాజకీయ పలుకుబడి ఉంది. సదరు మిల్లర్ ఎవరు అధికారంలో ఉంటే వారిపంచన చేరి తన అక్రమ దందాను నిరాటకంగా కొనసాగిస్తుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే సివిల్‌సప్లై శాఖలో ఓ అధికారి ఆశ్రయం కోరాడు. మంగళవారం సదరు మిల్లు ఓనర్ కలెక్టరేట్‌లోని సివిల్‌సప్లై కార్యాయలంలో తిష్ట వేశాడు. కేసు లేకుండా, ధాన్యం లారీని వదిలిపెడితే ఏకంగా రూ.10లక్షల వరకు లంచం ఇస్తానని సదరు అధికారితో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలాఉండా, సాధారణంగా పది బస్తాల పీడీఎస్ బియ్యం అక్రమంగా ఎవరైనా తరలిస్తూ పట్టుబడితే వెంటనే కేసు నమోదు చేస్తారు. కానీ సుమారు రూ.12లక్షల విలువ గల ధాన్యం లారీ పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే 24గంటలు దాటినా ఇంకా కేసు నమోదు కాలేదంటే సదరు మిల్లు ఓనర్ ఏ స్థాయిలో అధికారులను మ్యానేజ్ చేశారో స్పష్టమవుతుంది.

ధాన్యం లారీని వదిలేసి..

బియ్యం లారీని కర్ణాటకకు తరలించిన మిల్లు ఓనర్ కుమారుడు ధాన్యం లారీని సైతం దౌర్జన్యంగా తరలించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు తిరగబడ్డారు. అప్పటికే అక్కడికి పోలీసులు రావడంతో చేసేది లేక ధాన్యం లోడు లారీని అక్కడే వదిలేసి వెళ్లారు.

పదుల సంఖ్యలో కేసులు

పేదల ఆకలి తీర్చాల్సిన పీడీఎస్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అవినీతిపరులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడం పీడీఎస్ బియ్యం అక్రమ రవాణ ఏ స్థాయిలో జరుగుతుందో స్పష్టమవుతుంది.

సమగ్ర విచారణకు ఆదేశం

కేటీదొడ్డి మండలంలో పట్టుబడిన ధాన్యం లారీ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించాం. లారీలో ఉన్న ధాన్యం ఎక్కడి నుంచి వచ్చింది. ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యమా కాదా.. అన్న వివరాలు సేకరిస్తాం. అలాగే, ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యం వివరాలు మిల్లులో ఉన్న స్టాక్ వివరాలు పరిశీలించి వ్యత్యాసం ఉన్నట్టు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరైన అధికారుల పాత్ర ఉంటే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. పూర్తి వివరాలు తేలే వరకు ధాన్యంలారీని సీజ్ చేసి చింతలకుంటలోని రైస్‌మిల్లులో ఉంచాం.

– వి.లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

అధికారి కనుసన్నల్లోనే దందా..

సివిల్‌సప్లై శాఖలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఓ అధికారి కనుసన్నల్లోనే ధాన్యం దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రబీసీజన్‌లో రికార్డుస్థాయిలో జిల్లాలో ధాన్యం కొనుగోలు జరిపారు. అయితే మిల్లర్ల సామర్థ్యం పెంచి ఏకంగా ఈ ఒక్క సీజన్‌లోనే సుమారు రూ.50 లక్షల వరకు మిల్లర్ల నుంచి వసూలు చేసి వెనకేసుకున్నాడన్న ఆరోపణలు సదరు అధికారిపై వినిపిస్తున్నాయి. అంతేకాకుండా సీఎమ్మార్ బియ్యానికి బదులుగా పీడీఎస్ బియ్యం అందిస్తే వాటిని పాస్ చేయటానికి లారీకి రూ.50వేల నుంచి రూ.60వేల చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో గత ఏడాది అక్టోబర్‌లో జింకలపల్లి రైస్‌మిల్లు నుంచి వెళ్లిన పీడీఎస్ బియ్యం ఎలాంటి పరీక్షలు చేయకుండానే గోదాంకు పంపకుండా నేరుగా అయిజ ఎంఎల్ఎస్ పాయింట్‌కు పంపడం హాట్‌టాపిక్‌గా మారింది. జింకలపల్లి రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టుబడగా పోలీసు కేసు నమోదు చేస్తే సదరు మిల్లు ఓనర్ జైలుకు సైతం వెళ్లొచ్చారు.



సీజ్‌చేసిన ధాన్యంలోడు లారీ

ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయండి



ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

ధరూరు: ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరు పని చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని ఉప్పేరు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది హాజరు, ప్రసవాలు, స్టాక్, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగుల పూర్తి వివరాలు నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పీహెచ్‌సీలో ఎల్లవేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు సంబంధించి సాధారణ ప్రసవాలు చేయాలని, ప్రైవేట్‌తో పోల్చితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంఖ్యను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డెలివరీ క్యాలెండర్‌ను రూపొందించి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అత్యవసర సేవలిందించేందుకు ఈ ప్రాంతానికి ఒక అంబులెన్స్‌ను త్వరలోనే కేటాయిస్తామన్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే రోగాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలపై అవసరమైతే గ్రామాల్లో చాటింపులు చేయించాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలని, ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగు పరచాలని, ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి సిద్దప్ప, డాక్టర్లు రాజు, కృష్ణవేణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసరెడ్డి

అయిజ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తామని, పెండింగ్ లేకుండా ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రాజు, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ మదన్, ఏఈ నరేందర్ రెడ్డితో కలిసి ఎస్ఈ పెండింగ్ బిల్లులు వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్ బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, నిర్ణీత సమయంలో చెల్లించని వారి కనెక్షన్‌లు కట్ చేస్తామన్నారు. అదేవిధంగా విద్యుత్ సిబ్బందికి పెండింగ్ బిల్లుల వసూళ్లపై సలహాలు, సూచనలు చేశారు. అయిజ, మల్దకల్, గద్వాలలో పర్యటించినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ సంగీతలక్ష్మి

మల్దకల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరి పాటించాలని ఏడీఎ సంగీతలక్ష్మి అన్నారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ వీసీ ద్వారా అధికారులు నేరుగా రైతులు, మండల వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. పంటల సాగు విధనంపై అవగహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందని, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, ఏఈఓలు ఖాజాపాష, భాస్కర్, కిశోర్, రాహుల్‌పైలెట్, పల్లవి, సుజాత పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘని

గద్వాలటౌన్: జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను మెరుగైన ఫలితాలు సాధించడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని డీఈఓ అబ్దుల్ ఘనీ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా ఉమ్మడి పరీక్ష బోర్డు (డీసీఈబీ) సమావేశం నిర్వహించారు. గతేడాది పరీక్షల నిర్వహణ, ఫలితాలపై సమీక్షించారు. అనంతరం ప్రస్తుత ఏడాదిలో తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఈ ఏడాది పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులు మెరుగైన పౌష్టికాహారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలే చూడాలని, ఎల్ఐపీ, ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు వంద శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చూచించారు. సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ జహురుద్దీన్, ఏసీజీఈ శ్రీనివాస్, ఎంఈఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించాలి



కొండేరులో ఆయిల్‌పాం మొక్క నాటుతున్న ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి, తదితరులు

ఎర్రవల్లి: తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పాం సాగు విషయంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని టీఎస్ ఆయిల్‌ఫెడ్ జీ.ఎం సుధాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరులో మహిళా రైతు శిరీష పొలంలో ఏర్పాటు చేసిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 51 ఎకరాల్లో 22మంది రైతుల పొలాల్లో 2907 ఆయిల్‌పాం మొక్కలను ఒకే రోజు నాటడం జరిగిందన్నారు. అధిక ఆదాయానిచ్చే ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పాం మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని దాదాపు 30 సంవత్సరాల వరకు ఈ మొక్కలు దిగుబడిని ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఇస్తాయన్నారు. ఆయిల్‌పాం సాగుతో పాటుగా వాటిలో వివిధ రకాల అంతర పంటలను కూడా సాగుచేసి అదనపు ఆదాయం కూడా పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆయిల్‌పాం సాగును పోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తుందన్నారు. రైతులు ఆయిల్‌పాం సాగు చేసుకునేలా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇంచార్జి శివనాగిరెడ్డి, డివిజనల్ ఉద్యావవన అధికారి ఇమ్రాన్, రాజశేఖర్, మహేష్, ఏరియా అధికారి రామకృష్ణ, రైతులు శేఖర్‌రెడ్డి, చింపరయ్య, రాజు, విజయ్ మోహన్‌రెడ్డి, మహీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

పెంట్లవెల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 18న కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. మంగళవారం పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఇతర అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటిసారిగా కొల్లాపూర్ నియోజకవర్గానికి వస్తున్నారన్నారు. జటప్రోల్‌లో రూ. 150కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసిన అనంతరం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. హెలిపాడ్, సభా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీఓ భన్సీలాల్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు

- ఇప్పటి వరకు రూ.3.95 కోట్ల జరిమానాలు వసూలు
- జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు



గద్వాల క్రైం: జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే డ్రైవర్లపై చర్యలతో పాటు లైసెన్స్‌లు సీజ్ చేయడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడాతూ.. గద్వాల – అలంపూర్ సెగ్మెంట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్రాక్టర్‌లు, ట్రాలీ తదితర వాహనాల డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు నిలయంగా మానారన్నారు. తాజాగా ప్రైవేటు పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్ల తీరు సమస్యాత్మకంగా మారిందని, ఇప్పటికే వారిపై నిఘా ఉంచామని, త్వరలో వారిపై చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం, గూడ్స్ వాహనాల్లో ఓవర్‌లోడ్‌తో సరుకులు తరలించడం వల్లే రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందన్నారు.ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు.

2,313 వాహనాలకు రూ.3.95 కోట్లు జరిమానా

రాష్ట్ర ప్రభుత్వం 2025 - 2026 సంవత్సరానికి జిల్లాకు రూ.9.36 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించిందని, అయితే ఏప్రిల్ నుంచి ప్రస్తుత మాసం వరకు 2,313 వాహనాలకు రూ.3.95 కోట్లు జారిమానాల రూపేణ ట్యాక్స్‌లు వసూలు చేశామన్నారు. ఇందుల్లో ట్యాక్స్‌లు చెల్లించని వాహనాలు, సరైన ధృపత్రాలు లేకుండా తనిఖీలో పట్టుబడిన పలు వాహనాలకు జరిమానా వేశామన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద అనుమతి లేని వాహనాలపై చర్యలు చేపడుతున్నామన్నారు. వివిధ సర్వీసుల కోసం వచ్చే వారు ఏజెంట్లను నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సర్వీస్సులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. వాహన యాజమానులు, డ్రైవర్లు నేరుగా కార్యాలయంలోని అధికారులను సంప్రదించి సేవలను పొందాలన్నారు.

గుడిబండ వద్ద 'డ్రై పోర్ట్'



గుడిబండ వద్ద డ్రై పోర్ట్ ఏర్పాటుకు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని గుడిబండ సమీపంలో డ్రై పోర్ట్(రోడ్డు మార్గం ద్వారా ఓడరేవుకు అనుసంధానించబడిన ఇన్‌ల్యాండ్ టెర్మినల్) నిర్మాణానికి అధికారులతో కలిసి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. గుడిబండ శివారులోని సర్వే నంబర్ 118లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ, లాజిస్టిక్స్ డైరెక్టర్ అపర్ణ, ఇతర అధికారులు స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను అంచనా వేశారు. ఇటీవల దేవరకద్ర వద్ద ప్రతిష్టాత్మకమైన బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయగా.. తాజాగా గుడిబండ వద్ద డ్రై పోర్ట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో 68 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును కోరడంతో పాటు డ్రై పోర్ట్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు చెప్పారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి డ్రై పోర్ట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించడానికి అధికారులను గుడిబండకు పంపినట్లు తెలిపారు. హైదరాబాద్, కర్నూలు, రాయచూర్ ప్రాంతాలకు సులభమైన కనెక్టివిటీ ఉండటం కూడా డ్రై పోర్ట్ నిర్మాణానికి కలిసి వస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కేఎస్పీని పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు జలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి



కోయిల్‌సాగర్ కుడి కాల్వలోకి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

- రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తాం
- రైతులు నీటి వృథా చేయొద్దు
- పెండింగ్ పనులు పూర్తి చేసి మరో 50 వేల ఎకరాలకు నీరందిస్తాం
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కొండల నడుమ ప్రకృతి సిద్ధంగా ఉన్న కోయిల్‌సాగర్ ప్రాజెక్టును చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారని, ఈ ప్రాజెక్టును రూ.10కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వార సాగునీటిని వదిలిన సందర్భంలో విలేకరులతో మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పర్యాటక రంగం వెనకబడిపోయిందని ఆరోపించారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది రూ.3.5 కోట్లు, ఈ ఏడాది రూ. 6.5 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. త్వరలో పనులు సైతం ప్రారంభిస్తామని, పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు.

అదనంగా ఒక్క ఎకరాకు నీరందలే..

ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ నాయకులు, వారి కుటుంబాలు బాగుపడ్డాయని ఆరోపించారు. కోయిల్‌సాగర్ కింద 50 వేల ఎకరాలకు సాగునీరిందిస్తామని గతంలో ఇక్కడికి వచ్చిన మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి హరీష్ రావు ఇచ్చిన హామీ నేరవేర లేదని, అదనంగా ఒక్క ఎకరాకు నీరందించలేదని పేర్కొన్నాడు. పదేళ్ల కాలంలో కోయిల్‌సాగర్ కాల్వల మరమ్మతు చేపట్టలేదని ఐవీఆర్‌సీఎల్ వారు కూడా చేతులెత్తేయడంతో పనులు జరగలేదని ఆరోపించారు. పాత టెండర్లను రద్దు చేసి కొత్తగా రూ.40 కోట్లతో కాల్వల మరమ్మతుకు టెండర్లు వేయడం జరిగిందన్నారు. కాల్వలన్నీ లైనింగ్‌తో మరమ్మతు చేపడతామని, అదనపు ఆయకట్టుకు నీరిందించే దశలో సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. గ్రావిటీ కెనాల్‌ను త్వరలో ఇరిగేషన్ మంత్రి ప్రారంభిస్తారని, దీని వల్ల 20 గ్రామాల్లోని 10 వేల ఎకరాలకు అదనంగా సాగునీరిందుతుందని, అజిలాపూర్ లిఫ్ట్, చౌదర్‌పల్లి లిఫ్ట్‌ను మంజూరు చేయించామని వీటి వల్ల 18 వేల ఎకరాలకు అదనంగా సాగునీరిందించే దశలో పనులు చేపట్టడం జరిగిందన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రైతు రుణమాఫీ, రైతు భరోసాను అందించిడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. కోయిల్‌సాగర్ ఆయకట్టు రైతుల కోరిక మేరకు కరిగెట చేసి వరినాట్లు వేసుకోవడానికి కోయిల్‌సాగర్ కుడి ఎడమ కాల్వ ద్వార నీటిని వదలడం జరిగిందన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నీటిని ఆలస్యంగా వదిలేవారని, ఈ ఏడాది కోయిల్‌సాగర్‌కు గరిష్ట స్థాయిలో నీరు చేరడం వల్ల ముందుగానే నీటిని వదలడం జరిగిందన్నారు. వానాకాలం చివరి వరకు నీటి విడుదల ఉంటుందని, రైతులు తమ పొలాలకు పారిన తరువాత కింది పొలాలకు వదిలే విధంగా చూడాలన్నారు. అలాగే గొలుసు కట్టు చెరువులను కూడా నింపడం జరుగుతుందని అన్నారు.

జిల్లాకు కావాల్సిన చేపల ఉత్పత్తి

కోయిల్‌సాగర్‌లో చేపల ఉత్పత్తి కేంద్రం ఉన్నా ఉత్పత్తి జరగడం లేదని, ఈ విషయం మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. ఫిషరీస్ రాష్ట్ర డైరక్టర్‌లు ఇక్కడికి వచ్చి పరిశీలించి కొత్త నిర్మాణాలకు నివేదికలు రూపొందించారని తెలిపారు. ఈ విషయమై మంత్రి స్పందించి చేపల ఉత్పత్తి కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న కట్టడాలను పూర్తిగా తొలగించి కొత్త నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని, అలాగే ఇక్కడి ఉత్పత్తి అయ్యే చేపలు జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడంతో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు కూడాచేప పిల్లలను అందించే విధంగా కేంద్రాన్ని తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కోనరాజ శేఖర్, హన్మంతరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కిషన్‌రావు, గోపాల్, చందుగౌడ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మదన్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్.. ఫ్రస్టేషన్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

- సమస్యల వలయంలో రిజిస్ట్రార్ కార్యాలయం
- రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌ల కుర్చీలు ఖాళీగా దర్శనం
- కొట్టుమిట్టాడుతున్న ఆదాయాన్నిచ్చే శాఖ
- అద్దె భవనాలు, అరకొర వసతులతో ఇక్కట్లు
- పనిభారంతో ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగులు
- ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్‌పై నడుస్తున్న వైనం
- ఇన్‌చార్జీల పాలనపై విసుగు చెందుతున్న ప్రజలు



ఖాళీగా ఉన్న హెడ్‌క్లర్క్(సూపరింటెంట్), సీనియర్ అసిస్టెంట్ కుర్చీలు

మెట్టుగడ్డ: రాష్ట్రంలో ఆదాయాన్ని ఎక్కువగా ఆర్జించే శాఖల్లో అతి ముఖ్యమైన విభాగం రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం. ఆస్తులకు రిజిస్టర్డ్ పత్రాల ద్వారా హక్కు కల్పించి రక్షించడం ఈశాఖ యొక్క లక్ష్యం. స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులతో ఈశాఖ రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సేకరిస్తుంది. ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికీ అనేక కార్యాలయాలు అద్దె భవనాలు, అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. మరోపక్క ఉద్యోగుల కొరత, ఉన్నవారిపై పనిభారంతో కావాల్సిన పనులు సకాలంలో జరగడంలేదని ప్రజలు వాపోతున్నారు.

డిప్యూటేషన్లు, ఇన్‌చార్జీలుగా..

ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్(జిల్లా రిజిస్ట్రార్) కార్యాలయంలో పనిచేయాల్సిన ఉద్యోగులు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా, డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తుంది. కేవలం ముగ్గురు ఉద్యోగులతో కార్యాలయం కొనసాగుతుంది. కేవలం జూనియర్ అసిస్టెంట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిపాలన విభాగం నడుస్తుంది. ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ లే(ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్)గా విధులు నిర్వహించాల్సి దుస్థితి నెలకొంది.

ఉన్నతాధికారుల వైఖరే కారణమా?

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నట్లు కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తున్నా.. పట్టనట్లుగా ఉంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగులను భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఉన్నతాధికారి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ)ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఆదాయం చేకూర్చేవిగా పేరు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూర్చేవిగా పేరొందాయి. ఇలాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో కొన్ని కార్యాలయాలు ఇన్‌చార్జీలతో నడుస్తున్నాయి. విధులు నిర్వహించాల్సిన అధికారులు డిప్యూటేషన్ పేరుతో వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లిన దగ్గర సీనియర్ అసిస్టెంట్‌తో భర్తీ చేస్తున్నారు. వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

సస్పెండ్‌తో సరిపెట్టేస్తున్నారు

ఆదాయాన్ని అందించే శాఖలో ఉద్యోగుల అవినీతి తారా స్థాయిలో ఉంటుందనేది సర్వసాధారణంగా వినిపిస్తుంది. ఈ శాఖలో పనిచేసే సిబ్బంది తప్పులు చేయడం ఎంత సాధారణమో, ఆ ఉద్యోగుల సస్పెండ్ కూడా అంతే సర్వసాధారణంగా మారిందనేది బహిరంగ మాటే. ఉమ్మడి జిల్లాలోని ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల విక్రయంలో అవకతవకలు జరగడంతో ఆ ఉద్యోగిని సస్పెండ్ చేసి విషయం బయటికి రాకుండా చేతులు కడిగేసుకున్నారు. మరో కార్యాలయంలో కోర్టు వ్యవహారంలో ఉన్న భూమిని జీపీ ప్లాట్లుగా చేస్తే సస్పెండ్ చేశారు. మరో కార్యాలయంలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారని కేసులు నమోదు చేశారు. వారిని వేరే కార్యాలయానికి బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఇందులో లోగుట్టు పెరుమాళ్లకెరుక చందంగా తయారైంది.

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ.. యువకుడు మృతి



ఇస్మాయిల్(ఫైల్)

ఉండవెల్లి: ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని డి.బూడిదపాడు శివారులో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. అలంపూర్ మండలం లింగన్‌వాయి గ్రామానికి చెందిన ఇస్మాయిల్(27) ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం కర్నూల్ నుంచి బైరాపురం మీదుగా సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా బూడిదపాడు శివారులో ఎదురుగా బైక్ రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇస్మాయిల్ కిందపడి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఇస్మాయిల్ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మంగళవారం మృతుడి తండ్రి పెద్దఖాజా ఫిర్యాదు మేరకు మరో బైక్‌పై ఉన్న ఇమాంపురం గ్రామానికి చెందిన విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని శవం ఆచూకీ లభ్యం

కొత్తకోట రూరల్: పట్టణ శివారులోని జీటీ నారాయణ స్కూల్ సమీపంలో కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన విషయాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని మృతదేహంగా గుర్తించి పోలీసులు వనపర్తి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం శీర్షిక సాక్షిలో ప్రచురితం కావడంతోపాటు వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మృతుడికి సంబంధించిన వ్యక్తులు మంగళవారం కొత్తకోట పోలీసులను ఆశ్రయించి, వనపర్తి మార్చురీలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి తమదేనని నిర్ధారించారు. మృతుడు వనపర్తి మండలం నాగవరం గ్రామానికి చెందిన మండ్ల బక్కన్న(48)గా గుర్తించారు. నాగవరం నుంచి కొత్తకోటకు ఎందుకొచ్చాడు. కాల్వలో ఎలా పడ్డాడంటూ అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి కుమారుడు భీముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు. శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామానికి చెందిన పాటిమిని నాగన్న(58) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో ఆదివారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుమారుడు నాగేష్ వనపర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం మృతుడి కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీశైలం ఆనకట్ట గేట్ల మూసివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మంగళవారం శ్రీశైలం ఆనకట్ట గేట్లను మూసివేశారు. ప్రస్తుతం జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 22,497 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 28,448 క్యూసెక్కులు మొత్తం కలిపి 50,945 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుకుంటుంది. ప్రస్తుతం శ్రీశైలంలో 882.2 అడుగుల వద్ద వద్ద 200.20 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 33,224 మొత్తం 68,539 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. భూగర్భ కేంద్రంలో 17.464 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.792 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి మంగళవారం రాత్రి 8.30గంటల వరకు 31,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి కోసం 22,497క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 1,300 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 500 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 1,150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 27,611 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.830 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద నీరు చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. మంగళవారం 8 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం 23 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ ప్రాజెక్టుల నుండి వరద నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం ఎగువ నుంచి 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఏడు గేట్లను తెరిచి 28,707 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,300 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలి



క్రీడాకారులతో మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: వాలీబాల్ అకాడమీ క్రీడాకారులు భవిష్యత్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వాలీబాల్ అకాడమీకి రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ఎంపికైన బాల, బాలికలు మంగళవారం నుంచి అకాడమీలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా అకాడమీకి వచ్చిన పలువురు బాల, బాలికలతో డీవైఎస్‌ఓ మాట్లాడారు. అకాడమీ క్రీడాకారులు క్రమశిక్షణతో ఉండాలని, కోచ్‌లు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వాలీబాల్ అకాడమీలో మీకు అవకాశం వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి వరకు కాకుండా జాతీయస్థాయిలో ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. వాలీబాల్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ముఖ్యంగా సీనియర్ నేషనల్ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేయాలని కోరారు. గతంలో ఇక్కడ అకాడమీ ఉన్న సమయంలో జిల్లాకు చెందిన సందీప్, యశ్వంత్ అనే క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించారన్నారు. అలాగే పలువురు క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని వాలీబాల్‌లో నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, శిక్షణలో అలసత్వం ప్రదర్శించవద్దని, ఉదయం, సాయంత్రం వేళల్లో నిరంతరం ప్రాక్టీస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, వాలీబాల్, అథ్లెటిక్స్ కోచ్‌లు పర్వేజ్‌పాషా, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ మృతి



టూటౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం



ఓపీ సేవలు బంద్ ఉన్నట్లు ఏర్పాటు చేసిన స్టిక్కర్

- వైద్యుడితోపాటు ఐఎంఏ అధ్యక్షుడిపై దాడి
- మృతురాలికి సంబంధించిన నలుగురిపై పలురకాల సెక్షన్ల కింద కేసు
- వైద్యుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- ఓపీ సేవలు బంద్‌చేసిన ప్రైవేట్ ఆస్పత్రులు, ఎస్పీకి ఫిర్యాదు

పాలమూరు: జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగిన ఘటనలో చికిత్స కోసం వచ్చిన మహిళ మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని కుటుంబ సభ్యులు వైద్యుడితోపాటు ఇతర సిబ్బందిపై దాడి చేసి ఆ తర్వాత ఆందోళన చేసే క్రమంలో ఇరువర్గాల ఘర్షణలో ఐఎంఏ అధ్యక్షుడిపై దాడి జరిగింది. దీంతో రెండువర్గాలపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. నారాయణపేట మండలం బోయిన్‌పల్లికి చెందిన దేవమ్మ(63)ను మూత్ర సంబంధిత సమస్యతో ఈనెల 13న జిల్లాకేంద్రంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న యునైటెడ్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. రక్తం తక్కువగా ఉండడంతోపాటు మూత్ర సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించి ఆమెకు చికిత్స ప్రారంభించారు. సోమవారం సాయంత్రం రక్తం ఎక్కించే క్రమంలో మహిళ మృతిచెందడంతో వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణంలో ఏర్పడడంతో వైద్యుడు అమిత్ మహంకాళ్‌తోపాటు అక్కడ పనిచేసే సిబ్బందిపై మృతురాలి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడడంతోపాటు ఫోన్ తీసుకోవడం, కేష్‌షీట్ చించివేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ క్రమంలో సదరు ఆస్పత్రి వైద్యుడు అమిత్ మహంకాళ్ కులం పేరుతో దూషించాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య చర్చ జరుగుతున్న క్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్‌పై ఓ వ్యక్తి దాడి చేశారు. వైద్యులపై దాడి చేయడంతోపాటు వారి విధులకు ఆటంకం కల్గించిన నలుగురిపై 308 క్లాజ్ 3, 329 క్లాజ్4, 352, 351, 118 క్లాజ్ 1, 115 క్లాజ్ 2, సెక్షన్-4తోపాటు మరికొన్ని సెక్షన్స్ కింద కేసు నమోదు చేశామని, అదేవిధంగా డాక్టర్ అమిత్ మహంకాళ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు నిర్లక్ష్యమైన వైద్యం అనే సెక్షన్స్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఓపీ సేవలు బంద్

యునైటెడ్ ఆస్పత్రిలో సోమవారం రాత్రి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్‌తో యునైటెడ్ ఆస్పత్రి వైద్యుడు అమిత్ ఇతర సిబ్బందిపై జరిగిన దాడికి నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న అన్నిరకాల ప్రైవేట్ ఆస్పత్రుల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ సేవలు నిలిపి వేశారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ భవనంలో ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యులు సమావేశం ఏర్పాటు చేసి జరిగిన దాడిపై చర్చించారు. అనంతరం ఎస్పీ జానకిని కలిసి దాడికి కారణమైన వారిపై ఫిర్యాదు చేయడంతోపాటు భవిష్యత్‌లో వైద్యులపై ఇలాంటి దాడులు జరగకుండా ఉండడానికి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ప్రైవేట్ వైద్యులు అందరూ కలిసి టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు.

కేజీబీవీ భవనం పైనుంచి కిందపడిన బాలిక



గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కేటీదొడ్డి: కేజీబీవీ భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ విద్యార్థిని గాయపడిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సిబ్బంది కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూత్పూర్ గ్రామానికి చెందిన చెన్నయ్యగౌడ్ కూతురు సాయిశ్రుతి కేటీదొడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ చదువుతోంది. మంగళవారం ఉదయం బాలిక కళాశాల భవనం మొదటి అంతస్తులో తిరుగుతున్న క్రమంలో కళ్లు తిరిగి పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. వెంటనే గమనించిన సిబ్బంది బాలికను గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆస్పత్రి సిబ్బంది బాలికకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గద్వాల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని డీఈఓ మహమ్మద్ అబ్దుల్ గని, జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య, ఎంఈఓ వెంకటేశ్వరరావు, పరామర్శించారు. అనంతరం బాలికను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మావతి మాట్లాడుతూ సాయిశృతి ఇంటి విషయాలతో మానసికంగా కృంగిపోయిందని, ఉదయం నీరసంతో కళ్లు తిరిగి కిందపడిపోయినట్లు వివరించారు.

మిడ్జిల్‌లో పట్టపగలే చోరీ



బీరువా పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దృశ్యం

మిడ్జిల్: మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. సంతబజారులో నివాసం ఉంటున్న లింగం, అతని భార్య ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని రూ.లక్ష నగదు, అర తులం బంగారు, 8 తులాల వెండి మాయమైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన క్లూస్ టీం సాయంతో వేలిముద్రలు సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ



చోరీ జరిగిన స్టూడియోలో విచారణ చేస్తున్న క్లూస్‌టీం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని ఓ ఫొటో స్టూడియోలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన జగన్‌కు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో నిర్మల క్రియేషన్ పేరుతో ఫొటో స్టూడియో ఉంది. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు స్టూడియో పైన ఉన్న రేకులు తొలగించి స్టూడియోలోని కెమెరా, నగదు అపహరించినట్లు తెలిపారు. మంగళవారం గమనించిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి వచ్చిన క్లూస్ టీంతో ఆధారాలను సేకరించినట్లు పేర్కొన్నారు. చోరీకి గురైన కెమెరా విలువ రూ. 3.60 లక్షలు, కొంత నగదు అపహరించినట్లు పేర్కొన్నారు.

ముగ్గురి రిమాండ్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో మండలంలోని మరికల్‌కు చెందిన నరేందర్, నేరళ్లపల్లికి చెందిన పర్వతాలు, ఖిల్లాఘనపూర్ మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన శేఖర్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.